నిష్పాక్షికం

ఉభయభాషాప్రవీణ కాంభట్ల విశ్వనాథశాస్త్రిగారు (శారదాసమితి)

మేడపై కిటికీమీద పుస్తకం పెట్టుకొని సవిలాసంగా చిరునవ్వుతో చూస్తూన్నాది లక్ష్మి. అస్తమిస్తూన్న సూర్యకిరణాలు ఆ అమ్మాయి సుకుమారమూర్తిమీద ప్రసరిస్తున్నాయి. ఆ యింటిచుట్టూ ఉన్న పూలమొక్కలూ, పైగా కనుచూపుమేర శాద్వలస్థలాలూ, సూర్యకిరణప్రవాహంలో మునిగి బంగారురంగు పూసినట్లు మనోహరంగా మెరుస్తున్నాయి. పిల్లగాలిచేత పూలమొక్కలన్నీ తలలూపుతున్నాయి. ఆయింటికి తిన్నగా కొంచం దూరంలో నిర్మలజలంతో ప్రవహిస్తున్నాది గోదావరినది. మారుతపోతములను తరంగహస్తాలతో యీ తీరాన్ని చేరుస్తున్నాది నదీమతల్లి. కొంతసేపట్లా పుస్తకం చూస్తూ బొమలు ముడిచి దీర్ఘాలోచ నేదో చేస్తున్నాది లక్ష్మి.

సుమా రిరవైయేండ్లుంటా యామెకు. సుగుణవతి; రూపవతీని; పోసిన బంగారుబొమ్మ. ఆమె నిల్చుంటే ఎవడో అసమానుడైన శిల్పి చెక్కిన విగ్రహంలాగుంటుంది. ఆమె కదలేటప్పు డల్లా, మలయమారుతోచ్చలితమైన లేదీగలాగ విలాసాలొలుకుతూంటాయి. ఆముఖంలోని ప్రసన్నత, కళ్లలోని గాంభీర్యమూ, పెదవులపై నాట్యమాడే వెన్నెలాన్నూ, ఎంతమందిని ముగ్ధుల్ని చేసేయో అని ఆలోచన కలుగుతుంది. ఆమె పల్లెటూరిబిడ్డ. క్రొత్త 'ఫేష' న్సేమీ లేకపోయినా పులుగడిగిన ముత్యంలాగ స్వచ్ఛంగాను, అందంగాను ఉంటుంది. మంచి తెలివితేటలు కలదే. కాని, సిగ్గుచేత కాబోలు అధికంగా ప్రసంగించదు. వాళ్ల తండ్రి మంచి పండితుడు. చిన్నతనంలోనే ఈమెకు కావ్యాలు అవి చెప్పేడు. చాలా శీఘ్రంగా అవగాహన చేసుకుంటూ చురుకుగా చదువుతూండేది. ఇందుమించుగా కావ్యజ్ఞానం బాగనే సంపాదించింది. ఇంతలో పాపం ఆమె తండ్రి కాలంచేశాడు. అప్పటికి పన్నెండేండ్లుంటాయి లక్ష్మికి. కొంచం బలిష్ఠంగాను పొడవుగానూ ఉండేది. పన్నెండేండ్లే ఉన్నా పద్నాలుగేళ్ల దానిలాగ కనిపించేది. ఎలాగైనా యీ సంవత్సరం పెళ్లిచేయక తీరదనుకున్నారు తల్లీవాళ్లు.

పెండ్లి ఆయినదగ్గరనుంచి అత్తవారింట నుండడం చేత అణకువ, అనురాగం, భయభక్తులూ, అలవడ్డా యామెకు. ఏవిధంగా భర్తృప్రేమ సంపాదించాలో తెలుసుకున్నాది. పల్లెత్తెదురాడేదికాదు పెనిమిటిమాటకు. ప్రసంగవశాత్తూ మాటల్లో కొన్ని అసందర్భాలు కనిపించినా, ఊరుకొనేది, సమాధానం చెప్పకుండా. తనత్తారింటి కొచ్చేసరి కింకా పెనిమిటి చదువు పూర్తికాలేదు. కొన్నాళ్లు రాజమండ్రిలో చదువుకుంటూంటే తనుకూడా అక్కడే ఉండేది పెనిమిటితో. భర్త అప్పుడప్పుడు ఇంగ్లీషు చెప్తూండేవాడు. కాని పాపం అతనుకూడా విద్యార్థి. అనుకున్నంత చెప్పలేకపోయినా, కొద్దో, గొప్పో, చెప్తూండేవా డాకాలంలోనే ఆవకాశం చూచుకొని. ఇతని ఉద్దేశం కనిపెట్టి, పూర్వం 'ఫేషన్సు' విడిచిపెట్టి కొత్తపద్ధతుల నవలంబిస్తూండేది లక్ష్మి. తరచుగా దేశీయవిషయాలు, సాంఘికవిషయాలున్నూ ఆయన ఎప్పుడైనా చర్చించాడంటే, వాటిని బాగా 'క్రాస్' చేసి తెలుసుకొనేది. తనుకూడా బాగా విమర్శిస్తూండేది మంచి చెడ్డల్ని. ఇల్లా క్రమంగా చాలా లోకజ్ఞానాన్ని సంపాదించింది లక్ష్మి. పెనిమిటి స్కూలు కెళ్లిపోయ్యేడంటే, వ్యర్థంగా కాలయాపన చెయ్యకుండా, గృహకృత్యాలేవో చూచుకొని, ఏ నవలలో, ఏ నాటకాలో, ఏ వార్తాపత్రికలో చూసుకుంటూ కాలంగడిపేది. చిన్నతనంలో ఒక సంస్కృతమే అభ్యసించినా ఇప్పుడు నాలుగింటిలోను కాస్త విజ్ఞానం సంపాదించింది. కొద్దో

గొప్ప ఇంగ్లీషు, శాస్త్రపుస్తకాలు చదివి అర్థం చేసుకొనేపాటి హిందీ, తెనుగులో శాస్త్రవిజ్ఞాన మున్నా కూర్చుకుంది. సంస్కృతంమాట వేరే చెప్పక్కర్లేదు కదా! మొట్టమొదట అభ్యసించిందే అది. ఇన్ని ఉండేటప్పుడా పాటిలోకజ్ఞాన ముండకపోదుగద. ఇన్ని తన దగ్గరున్నాయన్న గర్వం రవంతున్నా భయంచేత ఎదురాడలేకపోయ్యేది పెనిమిటికి.

నాడాదివారం. సాయంత్రం 5 గంటలయింది. చల్లగాలికోసం గోదావరిగట్టుకి షికారెళ్లేడు కృష్ణన్. గోదావరీ తరంగాలమీదించి చల్లగాలి వీస్తూంటే మధ్యాహ్నం తాపమంతాపోయి హాయిగా ఉండేది. ఆకాశంలో పక్షుల్లాగ గోదావరిలో పడవ లెగురుతున్నాయి. విహారంకోసం కొంతమంది పడవలకు తెడ్లేసుకొని ఆవలకు చేరుతున్నారు. కొందరు యువకులు కూనిరాగాలు తీసుకుంటూ, సవిలాసంగా తిరుగుతున్నారు. కొంతసేపు పట్లాతిరిగి ఒక్కచోట నిశ్శబ్దంగా కూచోని వ్రాసుకుంటున్నా డేదో కృష్ణన్. ఈయన చిన్నకవి. ముద్దు ముద్దుగా చిన్నపద్యా లల్లుతూంటాడు. ఎక్కువ పరిశ్రమచేసి మంచి 'ఆర్టికిల్స్' వ్రాసి బాగా పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని ఉండేది. కాని అవకాశంలేకపోయ్యేది. ఎప్పుడైనా మిత్రులతో ఏదైనా చర్చించాడంటె తుదకు తన మాటె నిల్చేది. చాలాపట్టుదలతో పని చేసేవాడు. రెగ్యులరయిన మనిషి. కాలాన్ని వ్యయపరచకుండా విద్యావ్యాసంగంతో వెళ్లబుచ్చుతూండేవాడు. కాస్త అవకాశం దొరికిందంటే, ఏ "టెన్నిస్"కో ఏ "బాట్‌మింటన్"కో వెళ్లడమంటె తలకాయనొప్పి కృష్ణన్‌కి. ఎంతసేపూ నిశ్శబ్దంగా ఉన్న ప్రదేశంలో ఒక్కడూ కూర్చోడమంటె బ్రహ్మానందం.

ఇంచుమించుగా 30 ఏండ్లుంటాయి క్రిష్ణన్‌కి. చామనచాయ. పల్చగా పొడవుగానుంటాడు. చిన్నమీసం. చాలా నెమ్మదైనవాడు. శాంతమూ, సౌజన్యమూను ఆముఖంలో ప్రతిఫలిస్తూంటాయి. ఈయన చిన్నతనంలోనే తల్లి తండ్రులు పోయారు పాపం. విజయనగరంలో "ఇంటర్" చదువుతుండగా పెండ్లయింది. అప్పటికి 20 యేండ్లుంటాయి కృష్ణన్‌కి. పల్లెటూళ్లు ప్రాకృతజనము అంటే కొంత వ్యగ్రంగా ఉంటాడు కృష్ణన్. అయినా, పిల్ల బాగుందనో, లేక వస్తూన్న సంబంధాలన్నీ తిప్పేస్తూంటే లాభంలేదని తోచిందో, కాక కొత్తపద్ధతులు, నాదగ్గరఉంటె 1, 2 యేళ్లలో నేర్పలేనా అనుకున్నాడో, కాని తనకున్న ద్వేషమేమిలేక పోయినా లక్ష్మిని పెళ్లాడ్డాని కిష్టపడ్డాడు. వెంటనే తనతో తీసుకుపోదామనుకున్నాడు లక్ష్మిని. కాని సాగదని కాబోలు ఊరుకున్నాడు. అప్పుడప్పుడు సెలవల్లో తనతో "కేంపులు" తీసుకెళ్తూండేవా డెక్కడికైనా.

రాజమండ్రిలో బి.యె. చదువుతూండగా కాపురాని కొచ్చింది భార్య. కొన్నాళ్లు తనొక్కడూ ఉన్నా, తర్వాత తీసుకెళ్లేడు లక్ష్మిని. అప్పటికింకా బాగాపోలేదామెకు పల్లెటూరివాసన. ఒకసారి తనకొచ్చే ఇంగ్లీషంతా చెప్పి దొరసానిలాగ తయారుచేదామని ఉండేది క్రిష్ణన్‌కి. లక్ష్మికూడా అతని ఉద్దేశాని కనుగుణంగానే నడుస్తూండేది. రోజూ సాయంత్రం పత్రికల్లోని దేశీయవిషయాల్ని వినిపిస్తూండేవాడు లక్ష్మికి. ఏదైనా లక్ష్మితో చర్చించాడంటే, తనదగ్గర భయంచేత నిష్కర్షగా మాటాడేదికాదు కాని తగిన తెలివితేటలామెదగ్గరున్నాయనిమాత్రం గ్రహించేవాడు కృష్ణన్. కొంత చదువుకలిగితే స్వాభిప్రాయాన్ని నిర్భయంగా చెప్తుందికదా అని అనురాగంతో బుజ్జగించేవాడు లక్ష్మిని.

సంవత్సరం కావచ్చింది క్రిష్ణన్ ఉద్యోగంలో ప్రవేశించి. ఉద్యోగంలోనున్నపుడు మునపటంత హడావడుండదుగా. కావలసినంత అవకాశం. ఆ టైములో యేమేనా రాదామా అనుకొనేవాడు కాని కొంతసేపు కచేరీలో 'వర్కు' చేసి యింటికొచ్చిన

తరవాతనైనా, బుద్ధి కామాత్రం విశ్రాంతి లేకపోతే ఎట్లా? కచేరీనుంచి రాగానే ఒక్కసారింటికొచ్చి శాస్త్ర కాఫీ పుచ్చుకొని బయల్దేరేవాడు "క్లబ్బు"కో పేకాటకో.

సంతానవతి అయిందంటే స్త్రీ సమస్త హక్కులను సమానంగా పొందుదామనుకుంటుంది పురుషుడుతో. మునుపటికంటె స్వేచ్ఛ యెక్కువవుతుంది. మగాళ్లలో ఉండే లోపాలను సవరించడానికి తగిన సాహసంకూడ కలుగుతుంది. అప్పటి కొక కొడుకూ, కూతురూను లక్ష్మికి. కొడుకు 5, 6 ఏండ్లవాడు.

రాత్రి 9½ గంటలయింది; యింకా క్లబ్బునుంచి రాలేదెందుచేతనా అనుకొని కొంగుపరచి పిల్లదాన్ని జోగొడుతునాది లక్ష్మి. దగ్గరగా కూచొని 'లాంపు' పెట్టి చదువుతునాడు పుత్రుడు.

"అబ్బాయీ! తలుపెవరో తట్టుతున్నారు, నాన్నగారుకాబోలు; చూడమ్మా" అన్నదిలక్ష్మి పండుకొని పుత్రాడితో. అబ్బాయి పరుగెత్తివెళ్ళి తలుపుతీశాడు. "ఇవాళ చాలా ఆలస్యమయిం"దనుకుంటూ గదిలోకెళ్ళి, కోటుగీటుతీసి తోపుకొచ్చాడు కృష్ణన్.

"లక్ష్మీ! ఇవాళ మీపల్లెటూరి భోజనాలే మనవి, 10 గంటలకు" అన్నాడు కృష్ణన్ హాస్యంగా.

"ఇప్పుడు భోజనానికి పల్లెటూరివాళ్ళమే అయినా, తెల్లవారితే నాగరికులమేగా తాగుడికి!" అన్నాది లక్ష్మి చిరునవ్వుతో.

"అంటే"—

"వేగం భోజనాన్కి లేవండి, తరవాత మాట్లాడ వచ్చు" నన్నది లక్ష్మి. ఇదివరకు లక్ష్మిఅంటే మంచి అభిప్రాయమే ఉన్నా, కృష్ణన్ చదువుకున్నవాడి నన్న గర్వంచేత కాబోలు, తను వ్రాసేకథలూ, అవీని, చూపించేవాడు కాదు లక్ష్మికి, ఆడవాళ్ళకు చూపించట మెందుకాఅని. అవి "పబ్లిష్" అయిన తరవాతనైనా చూచి అందులో మంచిచెడ్డలు ఆయనతో విమర్శిస్తూండేది లక్ష్మి. ఆయనకూడా అభిప్రాయం మారింది క్రమంగా. "లక్ష్మి చాలా బాగా విమర్శిస్తునాది గదా! ఈమె కెంచేత చూపెట్టకూడదు "ఆర్టికిల్స్" ముందుగా?" అనుకున్నాడు కృష్ణన్. "ఇదివరకు అంటే చనువు తక్కువగా ఉండడంచేతనూ, భయంచేతనూ స్వేచ్ఛగా మాటాడేది కాదు. ఇప్పుడలాంటి చికాకేమీ లేదుగా. ఎంతసేపూ నన్నెదిర్చి వాదిద్దామా అని ఉద్దేశపడుతునాది. సరే, చూదా" మనుకున్నాడు కృష్ణన్.

"లక్ష్మీ! ఇల్లా ఒక్కసారిరా! మళ్ళీ వెళ్లిపోదుగాని" అన్నాడు కృష్ణన్ ఆఫీసు రూములోంచి.

"అమ్మాయిని ఊయల్లో పరుండేశాను. అదింకా నిద్రపోలేదు. వేగం చెప్పం"డన్నది లక్ష్మి దగ్గర కొచ్చి. "కూచో చెప్తా"నని చేయిపట్టుకొని కుర్చీలో కూచోపెట్టి—

"లక్ష్మీ! ఇదుగో చూచేవా, గమత్తుగా క్రొత్త "ఫేషన్ను"తో కథలువ్రాస్తునాను. ఇలాంటివి మన "ఇండియన్ లిటరేచర్"లో లేవు. పాశ్చాత్య పద్ధతుల ననుసరించి వ్రాశాను. చూడు. చదువుతాను. సాంతంగా విని నీఅభిప్రాయం చెప్పాలి తుదని" అన్నాడు కృష్ణన్, చెయ్యిపట్టుకొని లక్ష్మిముఖం కేసి చూస్తూ.

"నాకు విమర్శించేపాటి శక్తుందా? మీరు వ్రాసేదాన్ని" అన్నది లక్ష్మి సవిలాసంగా చిరునవ్వుతో.

"కాదు. ఒక్కొక్కరి బుద్ధిలో ఒక్కొక్క విశేషముంటుంది. ఇదేమో నీకు తెలీని భావకాదుగా" అన్నాడు.

"ఏవో క్రొత్తగా ఇంగ్లీషుపద్ధతుల్లో వ్రాస్తునా మన్నారు. నాకు తెలీకనో, నచ్చకనో, బాగులే దంటే వ్రాయడం మానేస్తారా మరి? అదీకాక ఇదింకా వ్రాస్తునారుగా. పూర్తికానీండి. తొందరెందుకు? సగం విన్నతర్వాత మీముఖ్యోద్దేశం

తెలీక నే బాగులేదంటే మరి కోపమువస్తుందేమో?" అన్నది లక్ష్మి కళ్ళతో నవ్వుతూ—

"పోనీ నేను పూర్తిగా వ్రాసిన పుస్తకం ఇంకో టుంది. అది చదవనా? ఏదైతేనేమి నీఅభిప్రాయం తెలుసుకుందికి. అదీ ఇల్లాంటిదే. సాంతంగా వింటా నంటే చదువుతాను. ఇదిగో"—అన్నాడు కృష్ణన్ పేజీలు తిప్పుతూ—

"ఓహో! ఈపుస్తకమా, నిన్న నేను చదివేను మీ టేబిల్లోంచి తీసి. ఇప్పుడు మరెందుకు అది చదవడము?" అన్నది పెదవి విరుస్తూ—

"నేను లేనుగా, నువ్వు చదివేటప్పుడు."అన్నాడు కృష్ణన్. "మీరు లేకపోతే ఆపుస్తకం చదవలేరా? లేక చదవకూడదా? "పబ్లిష్" చేస్తె అందరి దగ్గర కూచొని చదివిస్తారా ఏమి" టన్నది లక్ష్మి.

"అయితే సరే, నిర్మొగమాటంగా నీయాశయ మేదో చెప్పు. ఉచితంగా చెప్పవలసిన విషయ మంటె భయపడకు. పుస్తకంలో నీకెక్కడైనా తెలీని విషయమున్నా, సందేహాలున్నా, అడుగు చెప్తాను.—కానీ—"అన్నాడు కృష్ణన్ చెయ్యిపట్టు కొని ఆడిస్తూ,—

"ఏమి చెప్పమంటారు. మొదటనుంచి కోపదాక మేము చెప్పేదంతా మీకు వ్యతిరేకంగానే కనిపిస్తుం దనుకుంటాను. మీరు వ్రాసింది బాగులేదంటె మీ కాగ్రహంవస్తుంది.—సెలవీయండి నిద్దరొస్తున్న"ద న్నది లక్ష్మి నిల్చొని.

"నిన్న చెప్పమన్నానుగా, నేను. నీఉద్దేశ మెట్లాఉంటే అదేచెప్పు. దానికి సందేహమెందుకు? నిద్దరొస్తున్నాదనా! నేనుమాత్రం నిద్రపోనా," అన్నాడు కృష్ణన్.

"సరే అని పుస్తకం చేత్తోపట్టుకొని పేజీలు తిరగేస్తూ......ఏదైనా వ్రాసినదాన్ని విమర్శించడ మంటే అందరూ పెద్దలే, కాని వ్రాయడమంటే మాత్రం ఉంటాడో ఉండడో వెయ్యికొకడైనా!

పద్యరచనకంటె గద్యరచనే కష్టమనుకొంటాను. ఎంచాతనంటే యతిప్రాసలతో నీరసంగా ఒక తడిక నల్లినా కవిత్వమనుకొని సంతోషించేవాళ్లు కొంద రుంటారు. కాని, కల్పనావైచిత్రి, భావనాశక్తి, లేందీ గద్యరచనకు సంతోషించేవాళ్లరిది. అదీకాక కేవలపద్యరచనే కవిత్వమనుకొనేవాళ్లు కొందరుం టారు. కాని......

కవిత్వమంటే సుందరమైన పద్యరచనేకాదు. సుందరమైన ప్రతివస్తువులోనూ ఉందికవిత్వం. ఆ వస్తువును చూచేటప్పుడల్లా ఆవిర్భవిస్తూంటుంది. అదీకాక కవిదృష్టికి అసహ్యమయిన పదార్థమంటూ ఉండదనుకుంటాను. ప్రతిది వానిదృష్టికి సుందరం గానూ, మనోహరంగానూ, కనిపిస్తూంటుంది. కవి అనేవానికి గోచరించని పదార్థమంటూ ఉండదు. కనకనే మనకు తెలీని యెన్నో విషయాలు, చాలా విశాలంగానూ, మనోహరంగాను, మనకు చూపెడ తారు. వారి శక్తి అద్భుతం. శ్మశానాన్నైనా దివ్యభవనం చెయ్యగలరు. రెక్కలు లేకపోయినా అంతరిక్షంలో పరుగెత్తగలరు. వారిది కామగమనం. వారికగమ్యమెక్కడా ఉండదు. వారిభావనాశక్తి ఆశ్చర్యంగా ఉంటుంది. స్వల్పమైనదాన్నైనా, అధికంగాచెయ్యగలరు. ఇంత ప్రతిభాశాలిఅయినా, ఇంత నిరంకుశప్రభావం కలవాడైనా, కవి, లోకాన్ని చూస్తూంటాడు ఏమంటున్నాదా అని. ఇదంతా లోకంమీద ఆధారపడి ఉందనుకొంటాడు. ఆత్మానందంకొరకు లోకంమీద ఆధారపడడమెం దుకా, అంటె "ఆపరితోషాద్విదుషాంనసాధుమన్యే." అంటాడు సత్కవి. నిజంకూడఅంతే. తనుచేసింది మంచిపని అనుకొని సంతోషించుతూన్న స్థితిలో తనలాంటివాళ్ళు సంతోషించడాని కింకావున్నా రంటె అధికమవుతుందిగా, సంతోషం. అంచేతనే, కొన్నివిషయాల్లో స్వతంత్రించినా, కవి, ప్రయోజ నాన్నిమాత్రం గమనిస్తూంటాడు. ఎంత క్షుద్రవస్తు వును లక్ష్యంగాచేసినా, అందులో కొన్ని సదుపదేశా లుండకపోవు. అందులో కొన్ని ఆదర్శాలుండక

పోవు. ఇంకో సంగతి. స్వచరిత్రలను కూడా కావ్యంగా సంఘటించేవాళ్ళు లేకపోలేదు. ఉన్నా సామాన్యంగా "కావ్యంయశసే...ఉపదేశయుజే" అన్నట్లు ఇందుకు తగేఉంటుంది కొంతవరకు. ఒక గ్రంథాన్ని వ్రాశాడంటే, కవి, స్వానుభవాన్ని కొంతవరకు మేళవిస్తూనే ఉంటాడు. అంచేతనే వారి గ్రంథాలను బట్టి కొంతవరకు ఆకవుల అనుభవాన్ని తెలుసుకోవచ్చునంటారు విమర్శకులు. కోప్పడకండేం. మీరు నిర్బంధంగా చెప్పమన్నారు కాబట్టి నాఆశయాన్ని మనవి చేస్తున్నాను.—

ఏదో అల్లిబిల్లిగా ఒకతడిక నల్లినంతమాత్రాన ప్రతీవాడూ, కవి అవుతాడా? ఆ వ్రాతల్లో ప్రాపంచకజ్ఞానం ప్రతిఫలించాలి. సంవిధానం సరసంగానుండాలి. కథలపుస్తకమయినా, కల్పనావైచిత్రి కనిపించాలి......ఆకథలకు ప్రత్యేకంపేర్లు రమణీయంగాఉన్నా మొత్తంమీద నామకరణంమాత్రం గ్రంథానికి సమిష్టిగానుండాలి. చూడండి—కవీంద్రుని కథాగుచ్ఛం. నాల్గయిదు కథల్లోను ఒక కథపేరా గ్రంథానికి నామకరణంచేస్తే, ఇంత మనోహరంగా ఉంటుందా? సరే—యీసంగతిట్లా ఉండనీండి. గ్రంథంలో స్వానుభవం ఎక్కువగా ఉండాలనడంచేత కాబోలు ఈపుస్తకంలో మీరు ఉదయం మొదల్గొని తెల్లవారేసరకు చేసేదంతా వ్రాశారు. ఎక్కడచూచినా మీగంభీరౌదార్య వర్ణనలేనా పేజీ తిప్పేసరికల్లా? "చెంపకుచారడేసి కళ్ళూ, ఆణిముత్యాల్లాంటి పళ్ళూ, కుందనంవంటి ఒళ్ళూ," అంటూ మీ వాళ్ళను వర్ణించుకోలేక లోలో మురిసిపోతూండడమేనా? మీదాంపత్య సుఖంలో సౌష్ఠవముంటే ఉండుగాక. అందులో లోకానికి ఆదర్శప్రాయమేమైనా లేదుగద. అపూర్వ విషయాలు సదుపదేశాలూకూడ అంతేగదా? అట్టి స్థితిలో- రాత్రింబవళ్ళు విచారించవలసిన స్థితిలో—ఇంతకంటే తెలివితక్కువలేదని పరితపించవలసిన స్థితిలో, ఎంతో, గొప్పగా, గమ్మత్తుగా వ్రాశానని సంతోషించడంకూడానా?—

ఇంకో సంగతి—ఎక్కడచూచినా వంకపాపిటలు, వాల్జడలు, వాయిల్జాకట్లు, లేసుచీరలు, 'రేడియమ్' రిష్టువాచీలున్నూ. ఇంతేగా మనసౌభాగ్యం! మాదగ్గర కూడా ఇట్లాంటి సుందరతర విగ్రహాలున్నాయని ఎడ్వర్టయిజుమెంటా లోకానికి? మీ వాల్జడలతోనూ, మీవంకపాపిటలతోనే మీరు సంతోషిస్తూ, ఈనూతనవేషాన్నే అభినందిస్తూ, కుచ్చెళ్ళకు చాలని పంచ, ఒంటినిండా పసుపు, నుదుట డబ్బంత కుంకుమ, చాలీచాలని ముడుగురవిక, మధ్యపాపిట, అందెలు, మట్టెలు, మెళ్లో చిటికెసేల్లావు బంగారుతాడు వీటితో అమాయకంగాను అనాగరకంగాను కనిపించే పుణ్యసువాసినీల వేషాన్ని నిందిస్తున్నారు. కాని అందులోనున్న - నిర్మలమైన—పవిత్రమైన—గభీరాశయాన్ని తెలుసుకోలేక పోయేరుగదా! అదీకాక - ఈకొప్పుపిన్నులు కొత్తగామాశారా? ఈ వాల్జడలు ముందుగా మీరే పోశ్చేరా? ఈ లేసుచీరలు మొట్టమొదట మీరె చూసేరా? లేదే. అయినా అప్పుడెక్కడో ఉన్న వేషం ఇప్పుడెక్కువగా తిరుగుతున్నా దన్నమాట. ఎలాగైనా సుందరవేషంతో దూపరహృదయాన్ని చూరగొందామన్న ఉద్దేశం లేకపోవడంచేత వాళ్లకీవేషం రుచించకపోవచ్చు. అంచేతనే కాబోలు మీకళ్ళకసహ్యంగా కనిపిస్తున్నారు.

సరే—ఇంకోవిషయాన్ని చూదాం. చాలాచోట్ల స్త్రీసంఘానికి తోడ్పాటుగా కొన్ని సదుపదేశాలు ప్రారంభించారు. మీరుకూడ సంఘసంస్కర్త ననిపించుకుందామనా? "ప్రతీసంస్థలోనూ స్త్రీలకు ప్రత్యేక ప్రాతినిధ్యంకావాలి. పురుషులతో సమానంగా సమస్తవిషయాల్లోను స్వతంత్రం ఉండాలి. బహిరంగంగా స్త్రీలుకూడ సాంఘికవిషయాల్లో పాల్గొనాలి." అంటూండడమే కాని స్వవిషయంలో మాత్రం పనికిరాదు. మీరు కచేరీకెళ్ళాక, ఏపురుషుడితోనో, ఏస్త్రీతోనో, కాస్తపేదన్నా మాటాడేమంటే—సిద్ధం బెత్తుపట్టుకొని, ఎవరాజ్ఞపై వెళ్లావనుకుంటూ. ఇంటిదగ్గర మమ్ములను దాసీలగా తలంచి,

బాహ్యప్రపంచంతో సంబంధం కలిగితే మీ మోహాన్ని తెలుసుకుంటామన్న దురుద్దేశంచేత మమ్ములను ఉన్నతస్థితికి రానియ్యకుండా,—పైపెచ్చు శ్రీరంగనీతులు గంభీరంగా చెప్పడానికైనా వెనుదియ్యరు గదా! జపించేవి మంత్రాలు, దూరేవి గుడిశలన్నట. ఆశయాలేమో మంచివే. కాని, ఆచరణ మాత్రం సున్న. కాకపోతే—భేదదృష్టి ఉండకూడదన్న మహామహులంతా-తప్పక ప్రాముఖ్యం ఉండాలన్న ప్రతిభాశాలురంతా— వ్యక్తిత్వం కావలన్న బుద్ధిమంతులందరూ—వాళ్ళు లేని సంస్థలకు ప్రాధాన్యముండకూడదన్న వక్తలంతా—తాము చెప్పినట్లె స్వవిషయంలో ఆచరించినట్లయితే, మన దేశానికి—సంఘానికిన్నీ, ఇట్టి దుర్దశ—ఇంత నీచస్థితి—ఈ బానిసతనము—మన్నింత పీడిస్తుందా? మీకుమాత్రం తెలికపోదు. చూడండి—దేశాంతరాల్లో కూడా పురుషులు ఇట్లాంటి శ్రీరంగనీతులు పలికేవాళ్ళే అయితే, స్త్రీలింత ఉన్నతస్థితికివచ్చి దేశోపకారంలో ముఖ్యస్థానాన్ని పొందగలరా?—రష్యా, యూరపు, అమెరికా, మొదలైన దేశాల్లో మహాసంగ్రామస్థితిలో కూడ స్త్రీలు తగిన ధైర్యసాహసాలు చూపించారంటే—ఎందుచేత?—సంపూర్ణ వ్యక్తిత్వమేగా?—అంచేత ఆచరణలేని వ్రాతలేల?

ఇంకోసంగతి—"స్త్రీలు ఏ విషయంలోనైనా మంచిధైర్య సాహసాలుపయోగించి, తగిన త్యాగాన్ని చూపించగలరు. వారిబుద్ధి చాలా సూక్ష్మమయినది కాబట్టి దాన్ని వినియోగించి మంచిగౌరవాన్ని సంపాదించగల"రని మీరు పైకనకపోయినా, మీ అంతరాత్మకు దృఢంగా తెలిసే ఉంటుంది. అంచేతనే మామూలంగా మీరు గౌరవం సంపాదించడానికి ప్రయత్నిస్తున్నారు. అట్లాగే తనభార్య గొప్పదనుకుంటే తనకు గౌరవముగదా, అని కాబోలు చాలాచోట్ల—లేకపోయినా, నేననకపోయినా, నా ఉద్దేశాలు భిన్నంగా ఉన్నా, నాముఖంగా మీరే మాట్లాడుతూ నన్ను పెద్ద ప్రొఫెసరుగా వ్రాస్తూవచ్చారు. మాకు తగిన ఉపకారం చేదామనుకొని, లేనిపోనివి మాయందారోపించి, మాఆశయాలు భిన్నంగా ఉన్నా మధ్యవరచి మీభావంతో ఐక్యం చేస్తూ మావ్యక్తిత్వాన్ని నశింపచేస్తున్నారు. కాని మమ్ములను గౌరవించడం కాదది. ముప్పైయేళ్ళు సాము నేర్చి మూసలిదాన్ని యెదుర్కొన్నాట్ట యెవడో.—మీ తీక్షణ బాణ పరంపరలు, మేమంటే చాలా వేగంగా బయల్దేరుతాయి. సరే దీనిమాటకేం. ఇట్లాంటిగ్రంథాలను వ్రాసి కొందరికి తెద్దునా, అందరికి తెద్దునా అన్నట్లు మాపని ఒకవూళనుంచి అవుతున్నా ఆత్మగౌరవానికికూడా హాని తెచ్చుకుంటున్నారు. కొన్నిచోట్ల హృదయసంక్షోభంకూడా వెల్లడౌతూంటుంది. రవీంద్రుని కథలు చూడండి కవివిశాలహృదయాన్ని ఎట్లా చూపెడుతున్నాయో! చిన్న చిన్న కథలైనా మంచిముద్దుగా ఉదారంగానూ, గంభీరంగానూ, ఉంటూ యాశయాలు. అందుచేతనే కవిదృష్టికి ప్రతీది గంభీరంగానే కనిపిస్తుందంటారు. గ్రంథాలవల్ల కవి హృదయంకూడ తెలుస్తూంటుంది లోకానికి. కాబట్టి ఇట్లాంటి సంకుచితభావాలను ప్రకటనచేసి హృదయవైశాల్యాన్ని తగ్గించుకున్నకంటె వేరే పాపమేముంది" అన్నది లక్ష్మి. పాపం చాలా సేపటినుంచి మాట్లాడడంచేత చిన్న ఆయాసం కలిగిందామెకు. చిన్ననిట్టూర్పు విడచి, "క్షమించండి! పట్టుదలచేత కాదు. నిష్పాక్షికంగా చెప్పమన్నారు కాబట్టి నా ఉద్దేశం తెలియజేసే" నన్నది లక్ష్మి చిరునవ్వుతో.

లక్ష్మి ఇట్లా చెప్తుందనుకోలేదు కృష్ణ. నేను విద్యావంతుడననే గర్వం బాగా కొంచెం ఉందనీ, ఏమన్నా శాంతంగా ఊరుకుంటాననిన్నీ తలచి ఇట్లా మాట్లాడిందేమో అనుకున్నాడు. కాని, మళ్ళా లక్ష్మి చెప్పినదాంట్లో నిజంలేకపోలేదు. నేను చెప్పమని బలవంతం చెయ్యడంచేత స్వాభిప్రాయాన్ని నిర్భయంగా చెప్పిఉంటుందిట్లా. అంతేకాని నాదగ్గర పాక్షికంగా మాట్లాడుతుందా లక్ష్మి యెప్పుడైనా, అనుకున్నాడు కృష్ణ.

"లక్ష్మి! చాలా బాగానే మాటాడావు. అయితే ఏంలేకపోయినా నిన్ను ప్రొఫెసరుగా వ్రాసేనన్నానేమి మరి?" అన్నాడు కృష్ణ.

ఇంతలో ఊయల్లోపిల్ల ఏడుపు ప్రారంభించింది. "ఇంక చాలివాళకి. చాలా రాత్రి అయింది. నిద్ర కూడా వస్తూంది," అంటూ వెళ్ళిపోయింది లక్ష్మి పిల్లను తీయడానికి.